స్మార్ట్ బోధన

- విద్యావ్యవస్థలో నూతన శకానికి నాంది పలికిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు 315 స్మార్ట్ ప్యానల్ బోర్డుల అందజేత
- డిజిటల్ బోధనకు శ్రీకారం



ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్ బోర్డుతో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కౌతాళం: పాఠశాల బోధనలో నూతన సాంకేతిక విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో లేని విధంగా ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్ డిస్‌ప్లేలను (ఐఎఫ్‌పీ) బడులకు అందజేసింది. దీంతో ఉపాధ్యాయులు డిజిటల్ విధానంలో బోధన సాగిస్తున్నారు. ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్ డిస్‌ప్లేల ద్వారా ఆధునిక బోధన విధానం అందుబాటులోకి తీసుకొచ్చింది. బోధనలో భాగంగా ఉపాధ్యాయుడు విద్యార్థికి మరింత బాగా అర్థమయ్యేలా, బహుళ ఉదాహరణలను వివరించడానికి యూట్యూబ్‌ను వెంటనే అనుసంధానించుకొని బోధన సాగిస్తాడు. దీంతో విద్యార్థులకు అంశాలపై అవగాహన పెరుగుతుంది. ప్రతి విద్యార్థిని పాఠశాల స్థాయి నుంచే ఆధునికంగా తీర్చిదిద్దాలనే కృతనిశ్చయంతో ఐఎఫ్‌పీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ప్రతి ఉన్నత పాఠశాలతో పాటు ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ క్లాసుల నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్యానల్ స్మార్ట్ బోర్డుల ద్వార డిజిటల్ విద్య అందేలా చర్యలు తీసుకుంది. ముందుగా ఐఎఫ్‌పీ వినియోగంపై ఉపాధ్యాయులకు కర్నూలులో మూడు రోజుల పాటు బ్యాచ్‌లవారీగా శిక్షణ ఇచ్చింది. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు డిజిటల్ క్లాస్‌లను బోధిస్తున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సజన్మాకతను వెలికితీసేందుకు ఈ డిజిటల్ తరగతులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. డిజిటల్ పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులకు భోదనోపకరణల ద్వార విద్యార్థుల ముంగిటనే అనుకున్నదే తడువుగా వాటి రూపాలను విద్యార్థులకు అర్థం అయ్యేలా చూపుతూ సులువుగా అర్థంమయేలా ఈ ఉపకరణలు ఉపయోగపడుతున్నాయి.

సైన్స్ మాత్రమే కాదు..

ఐఎఫ్‌పీల ద్వారా కేవలం సైన్స్, గణితం మాత్రమే కాకుండా ఇంగ్లిష్, తెలుగు వంటి భాషలను కూడా సులభంగా, బహుళ ఉదాహరణలు, చిత్రాలు, మ్యాప్‌లు, అదనపు సమాచారాన్ని, చిత్రాలు గీచి చూపుతూ బోధన సాగించవచ్చు. ఏదేని అంశంపై ఉపాధ్యాయుడు తనే చిత్రాలు గీస్తూ, బొమ్మలు వేసి, లేదా యూట్యూబ్ నుంచి మరింత సమాచారం, బొమ్మలు, ఆనాటి కాల పరిస్థితులు, వీటిన్నింటికి దృశ్య, శ్రవణ రూపంలో వినిపించడమే కాకుండా బోధన చేస్తారు. దీంతో ఒక అంశంపై విద్యార్థికి విస్తృత సమాచారం అందజేయడానికి వీలుంటుంది.

నియోజకవర్గానికి 315 ప్యానెళ్ల పంపిణీ..

ప్రభుత్వం ఒక్కో ప్యానల్ బోర్డు సుమారు రూ.1.30 లక్షలు ఖర్చు చేసింది. ఒక్క కౌతాళం జెడ్పీ పాఠశాలకు మొదటి విడతలో 24 ప్యానళ్లు వచ్చాయని ప్రధానోపాధ్యాయుడు ఈమ్మానియేల్ తెలిపారు. హాల్వి ఉన్నత పాఠశాలకు 14, బదినేహాల్‌కు 12, ఏరిగేరికు 14, కామవరంకు 11, ఉరుకుందకు 3 రాగా.., మరో ఆరు ప్రాథమికోన్నత పాఠశాలకు 15 ప్యానళ్లు వచ్చాయి. మండలానికి మొత్తం 93 ప్యానల్స్ వచ్చాయి. పెద్దకడూబూరు మండలానికి 39, కోసిగి మండలానికి 79, మంత్రాలయం మండలానికి 104 వచ్చాయి. నియోజకవర్గానికి మొత్తం 315 ప్యానెల్స్ రాగా, వీటి విలువ సుమారు. రూ.4.09 కోట్లుగా ఉంది.

త్వరగా అర్థమవుతోంది..



డిజిటల్ విద్యా విధానం వల్ల ప్రతి సబ్జెక్టు బాగా, త్వరగా అర్థం అవుతుండటంతో సంతోషంగా ఉంది. పదవ తరగతిలో మంచి మార్కులతో పాస్ అవుతాను. ప్యానల్ బోర్డులో వివిధ రకాల బొమ్మలు, కంటెంట్‌తో విస్తృతంగా బోధన చేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు చె ప్పే ప్రతి విషయం స్పష్టంగా అర్థం అవుతోంది. ప్రభుత్వం ఇంత నూత న విద్యా విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడం సంతోషకరం.

– రత్న, పదో తరగతి విద్యార్థిని, కౌతాళం

సంతోషంగా ఉంది



ఇది ఎంతో మంచి పరిణామం. మా బ్యాచ్ నుంచే ఇలాంటి నూతన డిజిటల్ విద్యావిధానం అమలు చేయడం సంతోషంగా ఉంది. ఆధునిక విధానంలో బోధన చేస్తుండటంతో మాకు ఎన్నో తెలియని అంశాలు కూడా తెలుస్తున్నాయి. కేవలం పాఠ్యపుస్తకంలోని సమాచారమే కాకుండా అదనపు సమాచారంతో పూర్తిగా అవగాహన కలిగేలా ఉపాధ్యాయులు డిజిటల్ విధానంలో బోధన చేస్తున్నారు. దీంతో సులువుగా అర్థం అవుతోంది.

– మహేశ్, పదవ తరగతి విద్యార్థి, కౌతాళం

ముందే శిక్షణ ఇచ్చారు



నూతన డిజిటల్ విద్యా బోధనకు ఉపాధ్యాయులకు ప్రభుత్వం కర్నూల్‌లో బ్యాచ్‌ల వారీగా మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. మా పాఠశాలలో 30మంది ఉపాధ్యాయులు ఉండగా రెండు బ్యాచుల ద్వారా శిక్షణ ఇచ్చింది. ఆ శిక్షణ వల్లే మేం విద్యార్థులకు ఇక్కడ డిజిటల్ క్లాస్‌లు చెప్పగలుగుతున్నాం. విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని సమాచారం కన్నా ఇంటర్‌నెట్‌లో మరింత, విస్తృతం సమాచారం సేకరించి బోధన చేస్తున్నాం. పిల్లలకు సులభంగా అర్థమవుతుంది. అలాగే పాఠ్యాంశాలను వీటిలో సేవ్ చేసుకునే వెసులబాటు ఉండటంతో రివిజన్‌కు ఇబ్బందులు తప్పుతాయి. అలాగే.. దృశ్య, శ్రవణ, చిత్రాల ద్వారా బోధనతో పిల్లలకు ఉత్సాహంతో ఆలకిస్తున్నారు.

– సుధాకర్, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు

చదువుకు సంపూర్ణ సహకారం



రూ.2లక్షలను అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: చదువుకునే పిల్లల భవిష్యత్ కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అనాథ పిల్లల చదువుల కోసం ఎమ్మెల్యే రూ.2 లక్షలను ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి, ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్యకు నగదు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ అనాథ, నిరుపేదల విద్యార్థుల అభ్యున్నతికి విరాళాలు సేకరించి బంగారు భవిష్యత్ అందించేందుకు కృషిచేయడంపై సంస్థను అభినందించారు. రామేశ్వరి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో అనాథలు నిరుపేదల కుటుంబాల్లో పిల్లలకు ఉన్నత చదువులు అందించేందుకు ఆర్డీటీ సంస్థ పనిచేస్తోందన్నారు. అనంతపురం కేంద్రంగా 5వ తరగతి నుంచి ఎంబీబీఎస్ వరకు దాదాపు 1500 మందికి పైగా ఆర్డీటీ ఉచితంగా చదివిస్తోందని వివరించారు.

వచ్చేనెల 9న జాతీయ మెగా లోక్‌అదాలత్

ఆదోనిరూరల్ : సెప్టెంబర్ 9వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రెండవ అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీయే రాజమార్గంగా ఎంచుకోవాలని సూచించారు. అన్ని రకాల భూసేకరణ వివాదాలు, రెవెన్యూ, ఫ్యామిలీ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగానే లోక్‌అదాలత్‌లో రాజీ కావొచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక ఫాతెహాలు



చాదర్ సమర్పిస్తున్న ధర్మకర్త, పీఠాధిపతి, భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక పూజలు చేపట్టారు. భారీగా తరలివచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి.

గుండెపోటుతో వలంటీర్ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: మండలంలోని కామన్ దొడ్డి గ్రామానికి చెందిన తలారి చిన్న బసన్న అంజినమ్మ దంపతుల కుమారుడు భీమయ్య (28) గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం వేకువజామున ఆకస్మికంగా ఉండె పోటు రావడంతో చికిత్స నిమిత్తం హాల్వి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భీమయ్య గ్రామంలో వలంటీర్‌గా ప్రజలకు సే వలందిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. మృతుడికి భార్య అరుణ, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ సీఎంకు ఆహ్వానం



బసవరాజు బొమ్మైకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఐపీ.నరసింహమూర్తి

మంత్రాలయం: ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ కర్ణాటక మాజీ సీఎం బసవరాజు బొమ్మై, యడ్యూరప్పకు వేర్వేరుగా బెంగళూరులో శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ.నరసింహమూర్తి గురువారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మెమొంటో,స్వామివారి ప్రసాదం అందజేసి ఆహ్వానించారు.

పల్లెల్లో చిచ్చు పెట్టేందుకు టీడీపీ కుట్రలు



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: ప్రశాంతంగా ఉన్న చిప్పగిరి మండంలోని పల్లెల్లో అల్లర్లు, గొడవలు సృష్టించడానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ ప్రయత్నిస్తోందని ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ ఆరోపించారు. ఆయన గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ.. వార్డు మెంబర్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని కుందనగుర్తి, ఏరూరు గ్రామాలలో తమ పార్టీ మద్దతుదారులు నామినేషన్ దాఖలు చేశారన్నారు. ఎన్నికల దృష్ట్యా తమ అభ్యర్థులతో మాట్లాడేందుకు కుందనగుర్తికి వెళ్లగా గ్రామంలోకి రాకుండా కొందరు టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారన్నారు. గొడవలు పడటం ఇష్టం లేక వెనుదిరిగి వచ్చామని స్పష్టం చేశారు. ఈ తతంగమంతా కోట్ల సుజాతమ్మ తమ కార్యకర్తల ద్వారా నడిపిస్తుందని ఆరోపించారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను ఇలా గొడవలకు ఉసిగొల్పడం తగదన్నారు. మండల కన్వీనర్ రంగస్వామి, నాయకులు రాజన్న శేఖన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో ఎర్ర తెగులు

మద్దికెర: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి పంటను ఎర్రతెగులు ఆశిస్తుందని రైతులు వెంటనే యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకోవాలని ఏఓ రవి సూచించారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. సరైన విత్తనాలు ఎంచుకోకపోవడం, వాతావరణంలో మార్పులు, పోషకాల లభ్యతలో సమతుల్యత లేకపోవడం, తేమ తొందరగా ఆరిపోవడం, కాయ ఏర్పడే దశలో వాతావరణ మార్పులు, ఎక్కువ రోజులు బెట్టకు గురవడం వల్ల ఎర్రతెగులు ఆశించిందని చెప్పారు. రైతులు యజమాన్య పద్ధతులు పాటించి భూమిలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. ఎర్ర తెగులు నివారణకు ఎకరాకు కిలో మెగ్నీషియం సల్ఫేట్, కిలో 13-0-45, 500 గ్రాములు మాక్స్ లేదా ఎఫ్-4ను వారం వ్యవధిలో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



కంబలదిన్నె సచివాలయం ఎదుట మొక్కలు నాటుతున్న దృశ్యం



కోసిగిలో శిలాఫలకం ఏర్పాటు చేసిన దృశ్యం

ఆదోనిరూరల్ : ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణ కోరారు. గురువారం మండలంలోని కపటి గ్రామంలో మేరీ మిట్టి-మేరే దేశ్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని, నేలను, ప్రకృతిని ప్రతిఒక్కరూ ప్రేమించాలన్నారు. సర్పంచ్ జి.కీర్తి, ఏపీఓ చంద్రశేఖర్, ఈసీ ఖాలిక్, టీఏలు లక్ష్మన్న, ఆనంద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీలేఖ, వెల్ఫేర్ అసిస్టెంట్ కేశమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శాస్త్రి, డిజిటల్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ శ్రీనివాస రావ్, ఎస్ఐ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కంబలదిన్నె, జాలవాడి, నాగులపురం, బసలదొడ్డి గ్రామాల్లోలో గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి - నాదేశం కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల ఆవరణలో శిలాఫలకాలను ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. ఏపీఓ రామన్న,హెచ్ఎంలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు మరువలేనివి

కోసిగి: దేశ సేవలో అమర వీరుల త్యాగాలు మరువలేనివని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నాదేశం- నాభూమి కార్యక్రమం నిర్వహించారు. అమర జవానుల గుర్తుగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించి మొక్కలు నాటి నీళ్లు పోశారు. అలాగే చిర్తనకల్లులో గ్రామ సర్పంచ్ ఈరన్న ఆధ్వర్యంలో శిలాఫలకం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. నాయకులు నాడుగేని నాగరాజు, రాజేష్ పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కమ్మరి లక్ష్మి, నాయకులు



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

జోరుగా నామినేషన్లు

మంత్రాలయం: మండలంలోని 52బసాపురం గ్రామంలోని 3వ వార్డు సభ్యురాలు బసమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ స్థానానికి ఎన్నిక నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం వార్డుకు చెందిన కమ్మరి లక్ష్మి నామినేషన్ పత్రాలను స్టేజ్ 1 ఆఫీసర్ ప్రభావతికి అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి ఉన్నారు.

ఆదోనిరూరల్ : మండలంలోని మేజర్ పంచాయతీ పెద్దతుంబళం 14వ వార్డుకు సంబంధించిన వార్డు మెంబర్ ఎం.మోతీమారెప్ప మృతిచెందడంతో ఎన్నిక జరపాలని నిర్ణయించడంతో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. చివరి రోజైన గురువారం వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ఎం.కాశన్న నామినేషన్ దాఖలు చేశారు. అలాగే జనసేన పార్టీ తరపున ఎస్.రాజు, టీడీపీ నుంచి ఆంజనేయులు నామినేషన్ వేసినట్లు ఎన్నికల అధికారి ఎంఈఓ శివరాములు తెలిపారు. ఎం.కాశన్నను పార్టీ నాయకులు హనుమంతరెడ్డి, తూర్పు రాజు, వన్నూరువలీ, టి.బసవరాజు, హెచ్.నరసయ్య, ఈరన్న, చాపల కేశవ్‌రెడ్డి, జి.వీరరాజు, పి.రాజేశ్వర్‌కుమార్, ఎం.బంగారప్ప తదితరులు బలపరిచారు.

కౌతాళం: ఖాళీగా ఉన్న వార్డు స్థానాలతో పాటు బదినేహాల్ పంచాయతీ సర్పంచ్ స్థానానికి గురువారం నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. బదినేహాల్ సర్పంచ్ స్థానానికి నాల్గు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నుంచి మాల పెద్దన్న ర్సప్పతో పాటు మాల దుర్గప్పలు నామినేషన్లు దాఖలు చేయగా టీడీపీ నుంచి హరిజన వీరేష్ రెండు సెట్ల నామినేషన్ల పత్రాలను సమర్పించారు. రౌడూరులోని 6వ వార్డు మెంబరుకు చాకలి లింగమ్మ, వీరేష్, కుంబళనూరులోని 3వ వార్డుకు లక్ష్మి, అయ్యన్న, కౌతాళంలోని 12వ వార్డుకు బోయ ఉరకుందమ్మ, గోతులదొడ్డి 8వ వార్డుకు పూజారి లక్ష్మి ఒక్కరే నామినేషన్‌ను దాఖలు చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు.

పెద్దకడబూరు: మండలంలోని కల్లుకుంట, గంగులపాడు గ్రామాల వార్డు ఎన్నికలకు గురువారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. కల్లుకుంట గ్రామం 11వ వార్డు మెంబర్ కోసం వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు సుజాత, లక్ష్మి నామినేషన్ వేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.వరప్రసాద్‌కు నామినేషన్ అందజేశారు. టీడీపీ నుంచి మాణిక్యమ్మ, సీపీఎం నుంచి రాణి నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని గంగులపాడు 5వ వార్డుకు వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు ముంతాజ్, ఉప్పర లక్ష్మి.. రిటర్నింగ్ అధికారి మల్లయ్యకు నామినేషన్లు అందించారు. టీడీపీ నుంచి కురువ లక్ష్మి రెండు సెట్లును దాఖలు చేసుకున్నారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి చూపాలి



మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిత్యం పురోగతి సాధించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మండల అధికారులకు సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పలువురు నాయకులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. అనంతరం మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా 35 గ్రామాలలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఆయా నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. పనితీరు బాగలేని అధికారులు ఇప్పటికైనా తీరు మార్చుకుంటే మంచిదని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు. హాజరుకాకపోతే వేటు తప్పదని హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోసిగి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, అలాగే విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఆర్డీటీ సంస్థ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని జంపాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కోసిగి, కౌతాళం మండలాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి చదువుతున్న బాలికలకు అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెం, 4''400 మీటర్లు రిలే, లాంగ్ జంప్, షాట్ పోటీలు నిర్వహించారు. 85 మంది బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మెడల్‌తో పాటు సర్టిఫికేట్ అందజేశారు. ఏపీ పీఈటీ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ అహ్మద్, పీఈటీలు నరసింహులు, రాజారాం, రామచంద్ర, శేఖర్, గ్రామ సర్పంచ్ హారోన్ పాల్గొన్నారు.

హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలి



ఐటీఐ కళాశాల ప్రారంభించాలని ఆర్థికశాఖ మంత్రిని కోరుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోనిటౌన్ : పట్టణంలోని ప్రభుత్వ హాస్టళ్లకు సొంతభవనాలు కేటాయించి, విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని కోరారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. అలాగే..కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు సమస్యలను వివరించారు.

ఆదోని సెంట్రల్: మండలంలోని ఆరేకల్లు గ్రామంలో నిర్మించిన మైనారిటీ ఐటీఐ కళాశాలను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భారతి కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. గురువారం ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ భవనం నిర్మించి మూడేళ్లయినా ప్రారంభించక పోవడం విచారకరమన్నారు. అలాగే..పట్టణంలో ప్రీమిటిక్ బీసీ బాలికల వస తి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నాగరాజు,గౌస్,గణష్, కుమార్,సత్య పాల్గొన్నారు.

రీ సర్వేతో శాశ్వత భూహక్కు

కౌతాళం: గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేతో రైతులకు హక్కు పత్రంగా శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం పని చేస్తుందని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సుళేకేరి గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దల నుంచి కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి సర్వేను ప్రారంభించిందన్నారు. మండలంలో మొదటి విడతగా ఇప్పటికే 6 గ్రామాల్లో సర్వే పూర్తి చేశామని ఈనెల 11వ తేదీ నుంచి సుళేకేరి, తోవి గ్రామాల్లో సర్వే చేపడతామని చెప్పారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. ఉచితంగా సర్వేతో పాటు హద్దు రాళ్లను కూడా ప్రభుత్వమే పాతిస్తుందన్నారు. ఆర్ఐ రాజశేఖర్ ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, నర్సమ్మ పాల్గొన్నారు.

నివాళి

మంత్రాలయం: మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన బసమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జి.భీమారెడ్డి, సర్పంచ్ ముక్కరన్న ఉన్నారు.

14న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మంత్రాలయం రూరల్: మండలంలోని వగరూరు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 14వ తేదీన ప్రారంభిస్తామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను తహసీల్దార్ దేవ చంద్రశేఖర్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజుతో గురువారం విడుదల చేయించారు.

మార్కెట్ వేలం వాయిదా

ఆస్పరి: మండలంలోని తంగరడోణ కూరగాయల మార్కెట్ నిర్వహణ హక్కుల వేలం వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో సర్పంచ్ శంకరమ్మ, పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో వేలం వేయగా పాటదారులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ఈనెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు. ఆసక్తి గల వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.



కోసిగిలోని ఆది ఆంధ్ర స్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

నులిపురుగులను నివారిద్దాం

కోసిగి: పిల్లల్లో నులిపురుగుల రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుందామని హెల్త్ సూపర్ వైజర్ రాము, ఎంపీహెచ్ఈఓ యల్లప్ప తెలిపారు. గురువారం కోసిగి ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో ఏఎన్ఎం సుజాత, ఉపాధ్యాయులు సమక్షంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.



విద్యార్థులకు మాత్రలను మింగిస్తున్న ఏఎన్ఎం, అశా వర్కర్లు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని మండిగిరి-2 హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్ అండ్ సైన్సు కళాశాలలో నులిపురుగుల నివారణ మందులను విద్యార్థులకు పంపిణీ చేశారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ మురళీమనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 800 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను ఏఎన్ఎం లక్ష్మి అశా వర్కర్లు నాగవేణి, భారతి విద్యార్థులతో మింగించారు.

సన్మానం



రోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్ : సినీ పరిశ్రమలో ఎడిటింగ్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న చిల్లాలె రోహన్‌ను స్వకుళసాళి(చేనేత) సంఘం పెద్దలు గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక జీవేశ్వర విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రోహన్ మాట్లాడుతూ ఇటీవల విడుదలైన బేబీ సినిమాకు తాను ఎడిటింగ్ విభాగంలో పనిచేశానని చెప్పారు. సమాజ్ అధ్యక్షుడు గణేష్, నాగరాజ్, కార్యదర్శి జిందే లక్ష్మన్న, యువరాజ్, మురళీ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



వీరారెడ్డి (ఫైల్)

పెద్దకడబూరు: కడుపునొప్పి తాళలేక వీరారెడ్డి(39) అనే యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ముచ్చగిరి గ్రామంలో బుదవారం అర్ధరాత్రి తరువాత చోటుచేసుకుంది. ఏఎస్ఐ శివరాముడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వీరారెడ్డి కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. వైద్యం చేయించినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో పురుగు మందును తాగగా..గమనించిన కుటుంబసభ్యులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టరు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారని చెప్పారు. వీరారెడ్డికి భార్య జయ్యమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడు తండ్రి చిన్నాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

జింక మృతి



పెద్దకడబూరు : మండలంలోని కంబలదిన్నె గ్రామ పొలిమేరలోని పొలాల్లో జింక మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు, రైతులు ఫారెస్టు సిబ్బందికి సమాచారమిచ్చారు. అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ గిరి అక్కడికి చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక పెద్దకడబూరులోని పశు వైద్యశాలకు తరలించారు. పశు వైద్యుడు దినాకర్ జింకకు పోస్టుమార్టం చేశారు. గిరి, పశు వైద్యుడు దినాకర్ మాట్లాడుతూ భయంతోనే చనిపోయి ఉంటుందన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్‌లో ఎటువంటి గాయాలు కానీ, విషాహారం తీసుకున్నట్లు లేవన్నారు. గుండెలో రక్తం గడ్డకట్టి ఉందన్నారు. జింకలు కొన్ని సార్లు భయానికి గురై గుండెల్లో రక్తం గడ్డకట్టి మరణిస్తాయని చెప్పారు.